

# నీడ

వినోదిని, వుత్తరం వ్రాసి పడేయకుండా, ఫోనూ వాడక వైరూ యివ్వకుండా, ఫాక్సు మెసేజీ పంపక, మధ్యాన్నం పూట మెయిల్లో వూడిపడింది.

సుజాత కునుకు తీస్తున్నది. పైడమ్మ వచ్చే వేళైంది క్షణం వేస్టు చేసుకోకుండా, నీళ్ల బకెట్టూ గిన్నెలూ రెడీగా పూల మొక్కలకు దగ్గరగా వుంటాయి, నిమిషాల మీద తోమేసి మెటల్ చట్రంలో అమర్చి లోపలుంచి వెళ్లిపోతుంది. ''తలుపేసుకో అమ్మా'' అనే కేక గుర్తు. సుజాత లేచి స్టాండు జరిపి తెచ్చి గిన్నెలనీ డిష్ వాషర్లో సద్ది తరువాతి ప్రాసీజరు చూసి, మళ్లా మంచం మీద వాలుతుంది. యెవరూ రాకపోతే మంచిదే. స్టూడెంట్సో ప్యూనో యెల్లైసీ అమ్మాయో, పోస్టువాడో, కరెంట్ రీడింగ్ చెక్ చేసే క్లర్కో రాకపోతే మళ్లా కునుకు తీస్తుంది. వచ్చారా వాళ్ల పనిచూసి పంపేయాలి.

ఇదేమో యంత్రయుగం. ఇంకా చెప్తే రాకెట్ యుగం. క్షిపణులు విసిరే యుగం. రకరకాల వుద్యోగాల్లో యిరుక్కున్న వారంతా యంత్రాలే. జాబ్ చేసే అవసరం లేని గృహిణీ యంత్రమే తన గృహంలో, తాపీగా యేదీ చేసుకునే వీలే లేదు. లేచింది మొదలుకొని పరుగే. నిద్ర గూడా గాఢ నిద్రకాదేమో కలత నిద్రే తీయాలి. ఫోన్ మోగుతుంది. యేదో అర్జంట్. పగలు తీరిక వుండదైపాయె.

అయిదింటికల్లా లేచి గేటు తాళం తీసి లైటేసి వుంచాలి. ''యెంతసేపు నిలబడనూ? పదిళ్లలో పనిచేసుకునేదాన్ని? యెవరింటికాలస్యంగా వెళ్లినా తిడతారు'' అని సాధిస్తుంది మెయిడ్. బకెట్ నీళ్లూ అందులో చెంబూ చీపిరీ రెడీగా వుండాలి. బకెట్ నిండా నీళ్లు పట్టాలంటే పదిహేను నిమిషాలు పడ్తుందని టైమ్ విలువ చెప్తుంది.

కుక్కూ అంతే. అన్నీ రెడీగా యెదురుగా వుంచితే గబగబా కాఫీ టిఫిన్

చేసి సర్వ్ చేసి, వంట మొదలెట్టేస్తుంది. తన పని చేసుకుంటూ వంట పూర్తిచేసి, కారేజీలు సర్ది వెళ్లి పోతుంది. గిన్నెల పనీ పళ్లేలూ, కాఫీ కప్పులూ సాసర్లూ వాటి పని గృహిణి చూసుకోవాలి, మరోచోట వంట చేయాలట.

సుజాత తలుపు గడియ వేయలేదు. దగ్గరగా లాగి వుంచింది. వినోదిని లోపలికొచ్చి బెడ్ రూమ్‌లో కొచ్చేసింది. సూట్‌కేసు చేతి సంచీ గోడవారగా వుంచి మంచంమీద కూచుని నవ్వుతున్నది. చప్పుడుకి సుజాత కళ్లు బరువుగా విప్పింది.

''వినో! ఫోన్ చేయచ్చునే? ఇల్లు మారాము. యెలా తెలిసింది? యెంత సేపు తిరిగావూ యిల్లు తెలుసుకోటానికీ?'' అని లేచి కూచున్నది సుజాత. లేచి కోలా తెచ్చి యిచ్చింది.

వినోదిని కోలాస్ట్రా నోట్లో పెట్టుకుని పీలుస్తు అన్నది.

''పాత బిల్డింగ్ కెళ్లి యంక్వయరీ చేశా. ఒకమ్మాయి నాతో ఆటోలో వచ్చి చూసి వెళ్లిపోయింది. తిరిగే అవసరమే రాలేదు సుజీ. డైనింగ్ రూమ్ వేపు వెళ్లకు. పడుకో. రైల్లో ఆర్డరిచ్చి తినే వచ్చా. కరెంటు లేక ఫాక్సు పని చేయటం లేదన్నారు. మీ ఫోను పలకలేదు. కంప్యూటర్ ఫోన్‌కీ కరెంట్ కావాలి. చాలా సేపెందుకు తిరుగుతానూ?'' అన్నది కోలా పీలుస్తూ.

''హెల్తాఫీసరు కజిన్ వచ్చింది'' గంటసేపటినించీ తిరుగుతున్నాను యిల్లు చెప్పేవారందక. బల్ల కట్టుకోలేరూ? ఇప్పుడైనా బల్ల కట్టించండి'' అన్నది దెప్పుతున్నట్టు.

''యేం పని మీదంత సేపు తిరిగిందటా?''

''సివియర్ డీసెంట్రీ ఎటాక్ చేసిందిట. క్యూర్ కాక నీరసిస్తున్నదట. మంచి మందిస్తారేమోనని వెతుక్కుంటూ వచ్చిందట''.

'' ఇచ్చారా ఆఫీసరు?''

''యివ్వరూ? సివియరు టైపాయె. ఇన్‌ఫెక్షన్ వల్ల అలా పీడిస్తుందని

పూరడింపుగా చెపుతూ, దయతో మందిచ్చి, రెస్టు తీసుకోమని, ప్రిస్క్రిప్షన్ గూడా రాసిచ్చి కార్లో తీసికెళ్లి, డయట్ చెప్పి దించి వచ్చారు. వినో మనం కలుసుకుని పదేళ్లు కాలేదూ? చాలా తీసేశావే? శలవుల్లో గూడా ప్రైవేట్ కంపెనీల్లో పని చేస్తావా? కోర్టుకి శలవులుంటాయే'' అన్నది బెడ్ మీద కూచున్న సుజాత.

'' ఓపికుంటే చేస్తా. చేయనా! ఫైనాన్షియల్ స్టేబిలిటీ వుండాలి. అవసరానికడిగితే లేదనేవారే యెక్కువ. వారి అవసరానికి చొరవగా వచ్చి డిమాండ్ చేస్తారు. లోకం తీరే అంత. యేజ్ పెరగలేదూ? అకాల వృద్ధాప్యం మీదబడింది. జుట్టూడింది. సిల్వర్ హెయిర్ బాగా కంటబడుతున్నది. స్పెక్ట్స్. నాలుగు ఫాల్స్ టీత్, ఒకటేమిటీ. సత్తువా సన్నగిల్లుతున్నది. పనెప్పుడూ వుండేదే అని వచ్చేశా'' అంటున్నది వినోదిని. డ్రింక్ పూర్తి చేస్తున్నది. కాలింగ్‌బెల్ మోగింది.

2

వినోదిని సుజాతతో కూడా కూడా తిరుగుతూ, పిల్లలను యెంజాయ్ చేస్తూ పని అందుకుంటూ, సర్వెంట్సునీ సంతోషపెడుతూ, సుజాత దినచర్యా, అలవాట్లూ, స్వభావం బాగా స్టడీ చేసింది.

ఇద్దరూ డైనింగ్ టేబిల్ ముందున్నారు. సర్వ్ చేసుకుంటూ భోజనం కానిస్తున్నారు. నవ్వుదాస్తున్నట్టు కనిపిస్తున్నది వినోదిని తలవంచుకుని బుద్ధిమంతురాలిలాగా తింటున్నది. సుజాత గమనించిందా దాగిన నవ్వును.

''నవ్వెందుకొస్తున్నదీ? నవ్వేయరాదూ? అణచటమెందుకూ? కొరబోతుంది వినో నవ్వేయి. చెప్పుల్లో కాళ్లు పెట్టుకుని బలవంతం చేస్తుంటే వుండిపోయినట్టున్నది నీ వ్యవహారం'' అన్నది సుజాత మారు వడ్డించుకుంటూ.

''నీ వ్యవహారం హెల్తాఫీసర్ను నీడలాగా అనుసరిస్తున్నట్టున్నది సుజీ. ఆయన నీడన వున్నట్టున్నది గమనిస్తే ఒక్క పనీ స్వతంత్రించి చేయనీయడు. అన్నిటిలోనూ వేలు పెడతాడు. పోనీ పుష్కలంగా ధనార్జన చేసి నీ ఒడిలో పోయడు. జడ్జీ ననుకుంటాడేమో హెల్తాఫీసరు. ఫైనల్ తీర్పు తానే యిస్తాడు.

న్యాయవాది ననుకుంటాడేమో హెల్త్ఫీసరు, ''అదేం న్యాయం?'' అంటూ కూరల ధర చెల్లించటం గూడా తానే చేస్తూ ఆనెస్టీ చూపుతున్నాడు. యెవరికీ నష్టం రాని మార్గం చెపుతాడు. బోధకుడిననుకుంటాడేమో, తప్పిపోయిన గొఱ్ఱె పిల్లల్ని వెతికి తెచ్చి ఫాదర్ వద్ద దింపే కరుణామయుడిలాగా బిహేవ్ చేస్తున్నాడు. అవన్నీ ఆనందిద్దామనుకుంటుండగా మొగుడిననీ, యింటి పెద్దననీ పెద్దరికం, దార్ష్టీకం చూపుతున్నాడు హెల్త్ఫీసరు. దేనికిదంతా సహిస్తున్నావో, నీడలాగా అనుసరించటం దేనికో, అదే చెట్టు నీడ నెందుకుంటున్నావో అర్థంగాక, యేడుపు రాక, నవ్వు వస్తున్నది. నవ్వరాదని నొక్కి వుంచుతున్నా'' అన్నది ఆపుకోలేక యెడమ చేతివేళ్లు నోటిమీద సొగసుగా ఆనించింది వినోది. పల్చని పొడుగాటి వేళ్లూ, గోళ్లకి రంగూ. మణికట్టు వద్ద బిగుతుగా వాచీ గొలుసూ. యెముక కనబడని బొద్దైన చేయి. మంచి రంగు.

బూట్ల చప్పుడు వినబడింది. వాకిలి వంక చూశారు. తైనాతీలతోనూ, భజనపరులతోనూ ఆఫీసర్ వస్తున్నాడు.

లోపలికొస్తూనే, ''ప్రహ్లాద్ శర్మని హాస్పిటల్లో ఎడ్మిట్ చేశాను సుజీ! వాళ్లమ్మాయి చాలా బావుంటుంది. తండ్రికి మేజరాపరేషనని తెలిసి బెంగుళూరు నించి వచ్చేసింది. చాలా బాగా మాట్లాడుతుంది. మంచి కల్చరున్నది'' అంటూ బెడ్రూమ్ వేపు వెళ్లాడు ఆఫీసరు. వెంట వచ్చిన వారు డ్రాయింగ్ రూమ్లో ఆసీనులైనారు.

''అలాగే చూసి వస్తాము. వార్డు నంబరు రూమ్ నంబరూ రాసిస్తారా? విజిటర్సు వెళ్లే టైమ్లో వెళ్తాము. వినో తోడు వస్తుంది'' అన్నది సుజీ భోజనమైంది.

వినో నవ్వు దాచి, ''యెవర్ని చూచి రావాలండీ? ప్రహ్లాద్ గారినా కూతుర్నా? ఫ్రూట్సివ్వచ్చా? వుట్టినే వెళ్లగూడదే'' అనడిగింది.

వినబడనట్టు మరో సలహా విసిరాడు బెడ్రూమ్లోంచే.

''నా కారు వర్క్షాపు కెళ్లింది. ఫోన్ చేసి టాక్సీ తెప్పించుకో సుజీ''

డ్రెస్సింగ్ టేబిల్ మీద ఇన్విటేషన్ తీసి చదివాడు హెల్తాఫీసరు. గట్టిగా అరిచాడు ''సుజీ! డీవైయస్పీయేనా యీ యిన్విటేషన్ పడేసిందీ? వాళ్లింటికెళ్లద్దని నీకు వార్నింగిచ్చానే''.

ఆయన భార్యా అమృత పంపారండి ఆ ఆహ్వానం. మనమరాలు పుట్టిందట. తొట్టిలో వుంచి పేరు పెట్టే వేడుక చేస్తున్నదట. కారు పంపుతా తప్పక రమ్మని ఫోన్ చేశారామె'' అన్నది సుజీ. టేబిల్ తుడుస్తున్నది.

''అమృతం రమ్మన్నా, విషం రమ్మన్నా వీలు లేదు. యిబ్బంది రోజులని తప్పించుకోవాలి. వాడికి నీతీ నియమం మేనర్స్ లేవు. నా ఫష్టు కజిన్ని కేసులో యింప్లికేట్ చేశాడు. నేనున్నానని మరిచాడేమో వాడు. వాడికి క్లేస్ట్ భేదమున్నది'' అని మంచి దుస్తులేసుకొచ్చేప్పటికే మీల్సు రెడీ. ఆదరా బాదరా తిన్నాడు స్పూన్తో. చేయి మూతీ అద్దుకుంటూ వెళ్లిపోతుంటే, అనుయాయులు వెంట నడిచారు.

పిల్లలు బడినించి వచ్చి దుస్తులు మార్చుకుని, కాళ్లూ చేతులూ కడుక్కుని వచ్చి బల్లముందున్నారు. వినో సర్వ్ చేసింది.

''మేము సాయంకాలం హాస్పటల్కి వెళ్లాలి. కారొస్తుంది. ట్యూషన్ వద్ద దింపిపోతాము వస్తారా'' అన్నది సుజాత.

తలలు అడ్డంగా తిప్పి నవ్వారు. ఆనంద్, ''డాడీ ట్యూషన్ మాన్పించారు మమ్మీ. నీకు చెప్పలేదేమో. వారమైంది. తను ఎంగేజ్ చేసిన ట్యూటరు యింటికొచ్చే చెపుతాడట'' అన్నాడు అన్నం తింటూ.

కామూ నవులుతూ ముక్కలు తింటూ చప్పరిస్తూ అన్నది.

''మ్యూజిక్ టీచరు యింటికొచ్చే వైలిన్ ఓకల్ రెండూ చెబుతాడటమ్మా. నెలకి యాభై, డెయిలీ వస్తాడుట. నువ్వు చూపిన స్కూలు మేష్టరు నెలకు నూరు లాగుతూ వారానికి రెండు రోజులే చెప్తాడట. అంటే నెలకి యెనిమిది రోజులే ట్యూషన్. వానికేమీ రాదట. వచ్చినట్టు చెప్తున్నట్టు నటిస్తున్నాడట. డాడీ గేలిచేశారు మమ్మీ. చిప్పు వేయి పిన్నీ'' అన్నది.

సాయంత్రం పెద్ద పిల్లలొచ్చారు కాలేజీల నించి. వాళ్లూ రామన్నారు.

సాయంత్రం తయారౌతూ వినో అడిగింది ''అందరికీ సమ్మర్ ఫ్రాపు, బిన్నీ గుడ్డలూ, బూడిదరంగు పాంట్లూ? పొదుపు వుద్యమం నడుపుతున్నారా సుజీ? కౌబోయ్ పాంట్లు వినోదమిస్తాయేమో మగబిడ్డలకి. అమ్మాయిలకీ గూడానా? రెడీమేడ్ దుస్తులు, పంజాబీ దుస్తులు మంచివే వస్తున్నాయే సుజీ'' నిలువు టద్దంలో చూసుకుని పిన్నులు పెట్టుకుంటున్నది వినో.

''కరెక్టుగా వూహించావు వినో. నమ్మవేమో. తానే సెలెక్టు చేసి తెస్తారు. వాళ్లకి స్వేచ్ఛ యిస్తే కాస్ట్లీవి కొంటారుట. బాడ్ రిపోర్టు యెంక్వయిరీలు లేవుట. వాళ్లవాళ్లకి ఫార్మాలిటీస్ చూడాలిట. ఇంటి ఖర్చులూ. అప్పు చేయటం రోతట హరిహరాదులకైన అన్నారు''.

''అలా చూస్తే సుజీ నీవూ నీవారికి ఫార్మాలిటీస్ చెల్లించావే''

''అక్కర్లేదనే తేల్చారు. బెడ్‌రూమ్‌లో ప్రైవేసీ చిక్కినప్పుడు, లేదా యింట్లో యెవరూ లేక మేమిద్దరమే వుంటే, నవ్వుతూ కులుకుతూ అభినయిస్తూ, నన్నునుకరిస్తూ, '' ఆడపిల్లలు వాళ్ల వాళ్లు రాగానే, వాళ్లమ్మ రాగానే, జేబులోనిదో, పెట్టెలోనిదో తీసి రహస్యంగా అందిస్తారు'' అని వెళ్లిపోతారు హెల్తాఫీసరు. నేను ప్రిమిటివ్‌ట. సివిలైజ్డ్ కాదుట. ఋతి యుగం నాటి అలవాట్లుట'' అని పకాపక నవ్వి సుజాత, ''పికిల్సు దగ్గరుండే పెట్టిస్తారు నా చేత. స్వీట్సూ హాట్సూ అంతేననుకో. ఆ వేడుక చూడాలి నువ్వు. పోదాం పద''.

''చూచాలే సుజీ. అన్నమంతా పట్టుకు చూడాలా? నవ్వు వచ్చేదందుకే. హెల్తాఫీసర్ నీడవే. ఆయన నీడన వున్నావు. అదే నీడలో యెందుకుండాలీ? యెందుకుంటావు?'' చీరా తల దిద్దుకుని హాండ్‌బాగ్ అందుకున్నది వినో.

''నీడనిచ్చే అన్నిచెట్లూ ఒకటే. ఆలార్‌సెమ్. పిల్లల స్టడీస్, హెల్తు ప్రాబ్లమ్స్, గైడెన్సు నా ఒక్కతెవల్లా అవుతాయీ? ఇంకోటీ గమనించా. నేనున్నా నీడలోకే నా వాళ్లూ వాళ్ల వాళ్లూ వస్తారు. ఈ నీడే చల్లగా వున్నదేమో వేరే నీడ లేదేమో. టాక్సీ రాలేదు. ఆటోలో పోదామా''.

తీరా హాస్పిటల్‌కి వెళ్లి రూమ్ కనుక్కొని వెళ్లి చూస్తే కూతురు మనోరమ సామాన్యంగా వుండి, విచారంగా కనబడింది.తడి కళ్లతో అన్నది. ''నాన్నగారికి మధుమేహం తీవ్రమైంది. కాలుకి రక్తం అందక తీసేయాలన్నారు డాక్టర్లు. నిన్న తీసేశారు. ఇంకా బాగా తెలివి రాలేదు నాన్న గారికి. అమ్మా పెద్దదైంది వంటి మీది పొడలు చూచే వుంటారు మీరు. బాగా వ్యాపించాయి వళ్లంతా బొల్లి అంటారని యెక్కడికీ రాదు. బెంగుళూర్లో మా యింటి దగ్గర అత్తగారిని ఒప్పించి వచ్చా. ఇలా కూచోండి. కాఫీ వస్తుంది'' అని వార్డ్‌బోయ్ వంక చూసింది.

''వద్దు మనోరమా! మీ ఆయన తోడు రాలేదూ?'' అనడిగింది వినోదిని.

''నాకు భయం చూడలేను. రాలేను అన్నారు. మా అన్నా ఫామిలీ స్టేట్స్‌లో వున్నారు. వదినకు బ్రెయిన్ ట్యూమరు. ఆపరేషన్ జరిగిందట. అబ్బాయి యింజనీరుకి ఎపెండిక్సు ఆపరేషన్ జరిగిందట. కిడ్నీ ట్రబుల్ భరించలేక పోయాడట. అమ్మాయి కుసుమ యిల్లు మానేజ్ చేస్తున్నదిట రాలేనని ఫోన్ చేశాడన్న''.

తెచ్చినపళ్లూ బ్రెడ్డూ షెల్ఫులో వుంచి ఒకర్నొకరు చూసుకున్నారు సుజాతా వినోదినీ. పోదామా అన్నట్టున్నదా చూపు.